ప్రభుత్వ స్కూళ్లల్లో 'పాలంబడి'



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న హెచ్ఎం శ్రీనివాసరావు, విద్యార్థులు

కంచరపాలెం: జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కూరగాయలు, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడానికి 'పాలంబడి' కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు కంచరపాలెం రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు మొక్కలు నాటారు. వంగ, టమాటా, మిర్చి, కాలీఫ్లవర్, క్యాబేజీ, దొండ, చిక్కుడు మొక్కలు, పాదులను విద్యార్థులతో నాటించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, గౌరీశంకర్, సనపల రవి కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటేశ్వరరావు, గోకా నిర్మల, రత్నకుమారి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ సందడి

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు



గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న బాలురు

గోపాలపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాల, బాలికల విభాగాల్లో నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌తోపాటు అథ్లెటిక్స్ విభాగాల్లో విద్యార్థులు పోటీపడ్డారు. గత శుక్రవారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. వారిలో జిల్లా స్థాయికి ఎంపిక ప్రక్రియ ఇక్కడ నిర్వహించారు. దీంతో గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ ప్రక్రియను పలు పాఠశాలల పీఈటీలు, పీడీలు పర్యవేక్షించారు.

యారాడ సమస్యలపై వైవీ సుబ్బారెడ్డికి వినతి



వైవీ సుబ్బారెడ్డిని కలిసిన యారాడ ప్రాంత వాసులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం యారాడ ప్రాంతవాసులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు యారాడ గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలియజేశారు. నాగోతి మధు, బంక కనకరావు, చీపుల వెంకటప్పారావు, బంక సన్నీ, బంక చంద్రరావు, నాగేతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల దీపారాధన

కంచరపాలెం: వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గొల్లకంచరపాలెంలో దీపారాధన నిర్వహించారు. చిన్నారులు ఏర్పాటు చేసిన పందిరిలో గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

భారీ అన్నసమారాధనలు.. విశేష పూజలు



జోన్-2 కార్యాలయంలో అన్నదానం చేస్తున్న ఈఈ బీకే నాయుడు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న పీవీ సురేష్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేటలోని ఈపీడీసీఎల్ జోన్-2 కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. ఉత్సవాల్లో భాగంగా సిబ్బంది శుక్రవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ప్రారంభించారు. సుమారు 2వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించినట్టు సిబ్బంది తెలిపారు. కోతలు లేని విద్యుత్ సరఫరా గురించి ప్రజలకు అర్థమైన రీతిలో వినాయకుడిని ప్రతిష్ఠించిన సిబ్బందిని ఆయన అభినందించారు. శనివారం సాయంత్రం గణేష్ నిమజ్జనం ఉంటుందని తెలపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రామకృష్ణ, ఏఈలు వీర్రాజు, జేవీ రమణ, వినియోగదారులు, విద్యుత్ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం తెలుకలవీధి వద్ద స్థానిక యువత ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.అనంతరం భక్తులకు ప్రసాదాలు వడ్డించారు.

- 60వ వార్డు గుల్లలపాలెంలోని మహాత్మాగాంధీ వాణిజ్య సముదాయం వద్ద వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ప్రారంభించారు.కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు,భక్తులు పాల్గొన్నారు.

90వ వార్డులో అన్నదానాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు కొత్తపాలెం గణపతినగర్, చంద్రనగర్ ప్రాంతాల్లో వినాయక మండపాల వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల పైడిరాజు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఆడారి శ్రీను, దాడి ఆదినారాయణ, నారిపిన్ని చిన్ని, శేఖర్, అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

మల్కాపురం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 59వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల సమస్యలు తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు. కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనానికి మరమ్మతులు చేపట్టేలా అధికారులతో ఆయన మాట్లాడి దానికి మోక్షం కల్పించారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, అమరావతి, జీవీఎల్ నరేష్, అంగ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గురజాడ సేవలు స్ఫూర్తిదాయకం



తహసీల్దార్ వీరభద్రరావును సత్కరిస్తున్న స్కూల్ యాజమాన్యం

మల్కాపురం: మహాకవి గురజాడ అప్పారావు దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ములగాడ మండల రెవెన్యూ తహసీల్దార్ డి.వీరభద్రరావు అన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ స్కూల్‌లో విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గురజాడ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అతిథిగా ఆయన మాట్లాడుతూ దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా గేయాన్ని నేటితరం మరువదన్నారు. అనంతరం వీరభద్రరావు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు గురజాడ వేషధారణల్లో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవ్‌రావు, విజ్ఞాన వేదిక అధ్యక్షుడు పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శుక్రవారం ఆయన దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆలయ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా భక్తులకు మంచినీరు విరివిగా అందించే చర్యలుతీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం విభాగాన్ని పరిశీలించారు. సింహగిరికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బందికి గురి కాకుండా చూడాలని, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు,ఏఈ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్‌వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలి



గణపతి మండపంలో ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్‌లు శుక్రవారం జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల పరిధిలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన గణపతి మండపాల సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసిన రానీ సంతృప్తి అన్నదానం చేసినప్పుడు మాత్రమే వస్తుందన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు అనవసర ఖర్చులు చేయకుండా పేదల కడుపు నింపే అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో సెవెన్ వండర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో భరోసా



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న రామ్మోహనరెడ్డి

సింథియా: వైఎస్సార్ బీమా పేద ప్రజలకు వరం లాంటిదని వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన రెడ్డి అన్నారు. 63వ వార్డు చింతల్లోవకు పిసిని నాగేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. అతడు వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో తక్షణ సాయం కింద భార్య పిసిని అరుణకు వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్ రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ మిగిలిన రూ.90 వేలు మృతుని నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొట్నాన రవి, సూరాడ పెంటారావు, క్రాంతి నగర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.